సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం। 7। మార్చి। 2025



ఇప్పుడు బాదుడా..?

కృష్ణాపురం పీఏస్ పరిధిలో అప్పు మొత్తాలు పెంచారు. రైతులు ఆందోళన చెందుతున్నారు.


- 8లో



కిలో గంజాయికి..

గంజాయి రవాణా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఇచ్ఛాపురంలో వివరాలు వెల్లడించారు.

- 8లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
శుక్ర (సా)	శని (ఉ)
6.06	4.53

న్యూస్‌రీల్

కరెంటే వాడలేదు బిల్లు మాత్రం రూ.290



కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు పంచాయతీ కేంద్రంలో ఉన్న తెప్పల గారమ్మ ఒక్క యూనిట్ విద్యుత్ వాడకపోయినా రూ.290 బిల్లు వేశారు. గురువారం సాయంత్రం ఆమె ఇంటికి కరెంటు బిల్లు వచ్చింది. ఆమె అనారోగ్యం కారణంగా వేరే వారి ఇంటిలో ఉంటున్నారు. ఈ ఇంటిలో కనీసం ఒక్క రోజు కూడా కరెంటు వాడలేదు. ఒక్క యూనిట్ కరెంటు వాడకపోయినా చార్జీ రూ.237, షార్ట్ ఫాల్ బిల్, కస్టమ్ చార్జ్ రూ.25, ఫిక్స్‌డ్ చార్జ్ రూ.10, ఎఫ్‌పీపీసీఏ3 చార్జ్ పేరుతో రూ.9.5 అంటూ మొత్తం రూ.290.47 బిల్లు వచ్చింది. దీంతో ఆమె నిశ్చేష్టురాలయ్యారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన



లక్కుపురంలో పొలంలో ఉన్న ధాన్యం

బూర్జ: మండలంలో గల లక్కుపురం గ్రామంలో ఖరీఫ్‌లో పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధాన్యం బస్తాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. గురువారం రైతులు వియ్యపు భాగ్యారావు, వారాడ రామినాయుడు, వియ్యపు దుర్గారావు, వాకముడ్లు పెంటయ్య, శేషపు తవిటినాయుడు, పొదిలాపు ధర్మారావు తదితరులు పొలంలో ధాన్యం బస్తాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 20 శాతం మాత్రమే ధాన్యం అమ్మకాలు జరిగాయని, ఇంకా గ్రామంలో రైతుల వద్ద సుమారు 80 శాతం వరకు ధాన్యం నిల్వలు ఉన్నాయని వారు తెలియజేశారు. ఇదివరకు జేసీ హామీ ఇచ్చినా పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని అన్నారు. తక్షణమే న్యాయం చేయాలని కోరారు.

8 నుంచి పి-4 సర్వే



జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్ట్‌నర్‌షిప్ (పి 4) సర్వేకు కార్యాచరణ రూపొందించిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను ఉపయోగించి ఈ నెల 8వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే ప్రారంభించి 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఈ సర్వేపై మార్చి 6, 7 తేదీల్లో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదపడుతుందని, ప్రస్తుతం కుటుంబాలు అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపబోదని, సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా కుటుంబ అవసరాలకు అనుగుణంగా సమర్థమైన ప్రణాళికలు రూపొందించవచ్చన్నారు.



ఈమె పేరు తరిణి పద్మావతి. ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు గ్రామానికి చెందిన ఈ కిడ్నీ వ్యాధి బాధితురాలు ఇటీవలే కన్నుమూశారు. ఈమెకు తొలుత విశాఖపట్నం కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఆర్థికంగా ఇబ్బందులు రావడంతో పలాస కిడ్నీ ఆస్పత్రి చేర్పించారు. కొన్ని రోజులు డయాలసిస్ చేశాక మూడు రోజులకోసారి డయాలసిస్ చేయించుకోవాలని, ఒక్కో తడవకు రూ.2500 ఖర్చవుతుందని చెప్పారు. దీంతో ఆమె తనకు దగ్గరలో ఉన్న కవిటి, సోంపేట ఆస్పత్రులకు వెళ్లారు. కానీ ఎంత ప్రయత్నించినా అక్కడ బెడ్లు దొరకలేదు. అటు పెద్ద ఆస్పత్రులకు వెళ్లలేక, ఇక్కడ వైద్యం అందక ఆఖరికి ఆమె చనిపోయారు.



సర్కారు సేవాలోపం
ఉద్దానం విలాపం

కిడ్నీ రోగులకు సకాలంలో అందని డయాలసిస్ • డయాలసిస్ జరగక చనిపోతున్న రోగులు

- కేంద్రాల్లో రోజుల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి
- పలాస కిడ్నీ రీసెర్చ్ కమ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పట్టించుకోని ప్రభుత్వం
- ఇచ్ఛాపురం డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవానికి తీవ్ర జాప్యం

ఉద్దానం పల్లె మళ్లీ రోదిస్తోంది. కానీ సర్కారు వినడం లేదు. కళ్ల ముందే ఊళ్ల ఆయుష్షు కరిగిపోతోంది. అయినా ప్రభుత్వం చూడడం లేదు. ఎదురుచూసీ చూసీ రోగుల ఊపిరి ఆగిపోతోంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా గ్రామాలపై మహమ్మారి విషపు పడగ కమ్ముకుంటోంది. సదుపాయాలు చాలక, సేవలు అందక, తమ వంతు వచ్చే వరకు నిరీక్షించేంత ఆయువు లేక జనం ఆ రక్కసి రాస్తున్న మరణ శాసనానికి తల వంచుతున్నారు. ఉద్దానంలో ప్రమాద ఘంటికలు మోగించాల్సిన సమయం వచ్చింది. సర్కారు మొద్దు నిద్ర వదిలేలా నినదించాల్సిన అగత్యం ఏర్పడింది. ఎందుకో చదవండి..



కవిటి డయాలసిస్ సెంటర్ ఇది. ఇక్కడ 19 మిషన్లపై 121మంది డయాలసిస్ చేసుకుంటున్నారు. ఆరు నెలల కిందట 37 మంది డయాలసిస్ కోసం వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. ఇప్పుడు ఆ లిస్టు 16కు చేరింది. అంటే అంతకు ముందు డయాలసిస్ చేసుకుంటున్న వారిలో 21 మంది చనిపోయారు. ఇంకా వెయిటింగ్ లిస్టులో 16 మంది ఉన్నారు.



సోంపేటలో ఉన్న డయాలసిస్ సెంటర్ ఇది. ఇక్కడ 22 డయాలసిస్ యూనిట్లలో ఒక రోజుకు 66 మంది చొప్పున డయాలసిస్ చేస్తున్నారు. మొత్తం 116 మందికి ఈ సేవలు అందిస్తున్నారు. మరో 18 మంది నమోదు చేసుకున్నా వారికి బెడ్లు కేటాయించలేకపోతున్నారు. దురదృష్టం ఏమిటంటే ఎవరైనా చనిపోతే గానీ ఆ 18 మందిలో ఒకరికి డయాలసిస్ చేసుకునే అవకాశం దొరకదు. దీనికి తోడు ఈ సెంటర్‌లో సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో లేరు.

ఇచ్ఛాపురంలో గత వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ ఇది. అన్నీ సిద్ధంగా ఉన్నా కూటమి ప్రభుత్వానికి మాత్రం దీన్ని ప్రారంభించేందుకు మనసు రావడం లేదు. దీంతో రోగులు పలాస వరకు నిత్యం వెళ్లలేక, ఇక్కడ వైద్యం అందక నరకయాతన పడుతున్నారు.





పలాసలో వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించిన కిడ్నీ రీసెర్చ్‌కమ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఇది. కేవలం వైఎస్ జగన్ మార్క్ కనిపించకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆస్పత్రిని పట్టించుకోవడం మానేసింది. ఫలితంగా వందలాది మంది రోగులకు ఆశాదీపంలా ఉన్న ఆస్పత్రిలో సేవలు గగనమవుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉద్దానం మళ్లీ వెనక్కి వెళ్తున్నట్టు ఉంది. గత ఐదేళ్లలో కొత్తగా కిడ్నీ ఆస్పత్రి, కొత్తగా డయాలసిస్ సెంటర్, కిడ్నీ రోగులకు పింఛన్లు అందిస్తూ అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలిచింది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం కిడ్నీ రోగుల సమస్యలను పట్టించుకోవడం లేదు. అమెరికా తదితర దేశాల ప్రతినిధులు బ్లడ్ శాంపిల్స్ తీసుకుని వెళ్తున్నారే తప్ప కారణాలు చెప్పడం లేదు. వాటికి సంబంధించిన ఫలితాలూ రావడం లేదు. పోనీ ఇక్కడేమైనా చికిత్స ఆధునికీకరించారా..! అంటే అదీ లేదు. కనీసం అందరికీ డయాలసిస్ కూడా అందించలేకపోతున్నారు.

జిల్లాలో క్రానిక్ కిడ్నీ డిసీజ్(సీకేడీ)తో బాధపడుతున్న వారి సంఖ్య 23వేలకుపైగానే ఉంది. వీరిలో డయాలసిస్ చేయించుకుంటున్న వారు శ్రీకాకుళం, వైజాగ్, కవిటి, సోంపేట, పలాస కిడ్నీ ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. రద్దీ ఎక్కువగా ఉండటంతో డయాలసిస్ అవసరమైన వారందరికీ చేయలేని పరిస్థితి. ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం సోంపేట, కవిటిలో మాత్రమే డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. ఇవి సరిపోవడం లేదు. కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం రూరల్, ఇచ్ఛాపురం టౌన్, సోంపేట మండలాల కిడ్నీ రోగులందరికీ ఈ రెండు సెంటర్లే దిక్కు. నిత్యం 20మంది వరకు వెయిటింగ్ లిస్టులో ఉంటున్నారు. వీరికి సకాలంలో డయాలసిస్ జరగక ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోంది. ఆర్థిక స్థోమత ఉన్న వారు శ్రీకాకుళం, విశాఖపట్నం, పలాసలోని ప్రైవేటు ఆస్పత్రులకెళ్లి డయాలసిస్ చేసుకుంటున్నారు. స్థోమత లేని వారికి ప్రాణాలకే హాని జరుగుతోంది.

పింఛన్ రావడం లేదు



కవిటి మండలం కొరికాన పుట్టుగ గ్రామం మాది. గత ఏడాది నవంబర్ నుంచి డయాలసిస్ చేయిస్తున్నా. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఖర్చు భరించలేక చాలాకాలం ప్రయత్నిస్తే కవిటి కేంద్రంలో అవకాశం దొరికింది. కానీ నాకు పింఛన్ ఇవ్వడం లేదు. మందులు కూడా బయటే కొంటున్నాను. పింఛన్ ఇస్తే సాయంగా ఉంటుంది.

– కె.బాలరాజు, కిడ్నీ రోగి, కొరికానపుట్టుగ, కవిటి మండలం

స్థానికంగా అయితే డయాలసిస్‌కు వచ్చే వారికి కనీసం నిలువ కూడా ఉండడం లేదు.

ఉపాధి పోయింది..

మా అమ్మకు డయాలసిస్ చేయించాల్సి రావడంతో నా ఉపాధి పోయింది. నేను మహారాష్ట్రలోని ఓ కంపెనీలో పనిచేసుకుంటున్నాను. అమ్మకు కిడ్నీ వ్యాధి రావడం, నాన్న వృద్ధుడు కావడంతో అక్కడి నుంచి వచ్చేశాను. ప్రస్తుతం వారానికి రెండు రోజులు సోంపేట వచ్చి డయాలసిస్ చేయిస్తున్నాను. మాలాంటి వారికి ఇక్కడే ఉపాధి కల్పిస్తే బాగుంటుంది.

– సంతోష్, ఇచ్ఛాపురం



• తెరగని గాథలు



నాగావళి వారధి ఆ సంచార జీవులకు విడిదిల్లు. పొద్దంతా ఎక్కడ కష్టపడినా రాత్రికి నడుం వాల్చేది ఈ వంతెనపైనే. ఆ దీపాల వెలుగుల మధ్య, దోమలకు చిక్కకుండా ఇలా టెంట్లు వేసుకుని కునుకు తీస్తారు. పొద్దు పొడిచాక మళ్లీ బతుకు యుద్ధం మొదలుపెట్టాల్సిందే. ఈ కాసిన్ని గంటలు నాగావళి గాలులు జో కొడుతుంటే ఆదమరిచి నిద్దరోతారు. ఈ 'తెర'గని గాథలకు నది మౌనసాక్షి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఐదో రోజు 815 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ఐదో రోజు గురువారం ఫస్టియర్ విద్యార్థులు సెట్-2 ప్రశ్న పత్రంతో మ్యాథ్స్ 1ఎ, బోటనీ, సివిక్స్ పేపర్-1, ఇతర ఒకేషనల్ పేపర్ల పరీక్ష రాశారు. జనరల్, ఒకేషనల్ రెండు విభాగాల్లో కలిపి 22,498 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 21,683 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో రికార్డు స్థాయిలో 815 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదుకాలేదని ఆర్‌ఐఓ ప్రగడ దుర్గారావు ధ్రువీకరించారు.



రేస్‌కు సిద్ధం



ఐసీ ఇంజిన్ సామర్థ్యంతో తయారు చేసిన వాహనాన్ని పోటీలకు సిద్ధం చేస్తున్న కాకినాడ జిల్లా సూరంపాలెం ఆదిత్య కళాశాల విద్యార్థులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి గోకార్టింగ్ సీజన్-2 పోటీల్లో భాగంగా శుక్రవారం జరగనున్న రేస్‌కు వాహనాలతో విద్యార్థులు సిద్ధమయ్యారు. ఈ మేరకు గురువారం కళాశాల ప్రాంగణంలో వివిధ రకాల వాహనాలను ఎగ్జిబిషన్‌గా ఏర్పాటు చేయడమే కాకుండా వాటి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు రిహార్సల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో భాగంగా గోకార్టింగ్ వాహనాల తయారీ, వాటి సామర్థ్యాన్ని విద్యార్థులు వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా ప్రాంతాలకు చెందిన వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 16 బృందాలు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో 2019 అక్టోబర్ 15 నాటికి ఇళ్ల నిర్మాణం చేసి ఉన్న వారికి ఆ స్థలం రెగ్యులరైజేషన్ చేయించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. సంబంధిత దరఖాస్తులు గ్రామ వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబర్ నెలాఖరు వరకు గడువు ఉందని తెలిపారు.

నవోదయం 2.0 ప్రారంభిస్తాం

• ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి



డి.శ్రీకాంత్‌రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాను సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని, దానిలో భాగంగానే ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు జీఓ సైతం ఇచ్చిందని, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పూర్తిస్థాయి ప్రణాళికలతో కార్యాచరణ సిద్ధం చేస్తున్నారని డీసీ అన్నారు. గురువారం డీసీ సమక్షంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో గీత, సొండి కులాల వారికి మద్యం షాపుల కేటాయింపు లాటరీ పద్ధతిలో జరిగిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సారాయి కేంద్రాలను ఎ, బి, సి క్యాటగిరీలుగా విభజించామని తెలిపారు. మన జిల్లాలో ఇప్పటికే ఆరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 110 పాయింట్లను ఎస్‌హెచ్‌ఓలు గుర్తించారన్నారు. సారాయిని కాసే గ్రామాల్లోని వ్యక్తులను గుర్తించడమే కాక ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇప్పటికే నల్లబెల్లం వ్యాపారులు, సారాయి క్రయ, విక్రయాలు, కాసేవారు, పాతముద్దాయిలను గుర్తించామన్నారు. జిల్లాలో వేయిమందికి పైగా ఇలాంటి కేసుల్లో అనుమానితులుగా ఉన్నారని, వీరిలో 700 మందికి పైగా (70 శాతం) బైండోవర్లు కట్టామన్నారు. ఇప్పటికైనా సన్మార్గంలో నడవాలని, లేదంటే గట్టి చర్యలుంటాయని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు.

డీఆర్‌డీఏ పీడీపై నిరసన గళం




ఆర్ అండ్‌బీ బంగ్లా వద్ద నిరసన తెలుపుతున్న వీఓఏలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వెలుగు వీఓఏలపై అనుచితంగా ప్రవర్తించిన డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని, ఆయన చేసిన వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా వీఓఏలు గురువారం నిరసన తెలిపారు. ఏపీ వీఓఏ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. డీఆర్‌డీఏ పీడీ ధర్నా వద్దకు వచ్చి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావులు మాట్లాడుతూ డీఆర్‌డీఏ పీడీ అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వి.ధనలక్ష్మి, జి.అసిరినాయుడు మాట్లాడుతూ వీఓఏలుగా 95 శాతం మంది మహిళలే పనిచేస్తున్నారని, వారిని కించపరచడం బాధాకరమన్నారు. అనంతరం శ్రీకాకుళం పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పారు. కానీ మధ్యాహ్నం భోజనం కూడా చేయకుండా నిరసన తెలిపారు. తర్వాత పీడీ యూనియన్‌తో మాట్లాడడంతో ఆందోళన విరమించారు.

చీకటిలో ఇసుక దొంగలు

- దొంపాక కేంద్రంగా రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా
- యంత్రాలతో తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు





అర్ధరాత్రి ఇసుక తీసుకెళ్తున్న వాహనాలు

జలుమూరు: సురవరం పంచాయతీ దొంపాక వద్ద వంశధార నది నుంచి ఇసుక అక్రమంగా రాత్రి వేళలో తరలిస్తున్నారు. నిన్నటి వరకూ సైరిగాం పంచాయతీ పరిధి లింగంన్నాయుడుపేట నుంచి తవ్వకాలు జరిపిన నాయకులు తాజాగా దొంపాక గ్రామాన్ని ఎంచుకున్నారు. మండల కూటమి నాయకులతో కలిపి ఈ అక్రమ రవాణా చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాకు చెందిన మంత్రి అండదండలతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. కొద్ది నెలల కిందట జిల్లా పోలీసు అధికారికి ఫిర్యాదు చేసి ఇసుక లారీలు పట్టించినా వాటిని నామమాత్ర చర్యలతో పోలీసులు విడిచిపెట్టేశారని విమర్శలు వచ్చాయి. అయితే దొంపాక ఇసుక రీచ్ నుంచి ఇసుకను పాత అనుభవం ఉన్నవారే మళ్లీ ఈ అక్రమ రవాణాకు తెర తీశారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులే ఈ అక్రమ రవాణాదారులకు సమాచారం ఇచ్చి దాడులు చేసే సమయానికి కొమనాపల్లి వంతెన దాటిస్తున్నారు. పేరుకు దాడులు చేసినట్లుగా కలరింగ్ ఇచ్చి తూతూ మంత్ర చర్యలతో మమ అనిపిస్తున్నారు.

ఈ మార్గంలో రవాణా..

కొమనాపల్లి జంక్షన్, వంశధార వంతెన వద్ద వాహనాలు నిలుపుదలకు అవకాశం ఉండడంతో అదే చోట ఇసుకను తవ్వేందుకు యంత్రాలు సైతం సిద్ధంగా ఉంచుతున్నారు. రాత్రి తొమ్మిది గంటలు దాటిన తర్వాత సిద్ధం చేసిన యంత్రాలతో తవ్వకాలు జరిపి వాహనాలలో లోడింగ్ చేసి రవాణా చేస్తున్నారు. కొమనాపల్లి వంతెన నుంచి సరుబుజ్జిలి వైపు నుంచి ఈ వాహనాలు విశాఖకు తరలిస్తున్నారు.

ఎంపీపీ వాన గోపితో వాగ్వాదం

ఇసుక రాత్రి వేళలో అక్రమంగా రవాణా జరుగుతుందన్న సమాచారంతో ఎంపీపీ వాన గోపి, స్థానికులతో కలిసి గురువారం రాత్రి ఇసుక లారీలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇసుకాసురులు ప్రతిఘటించి వాగ్వాదానికి దిగారు. అనుమతులు ఉన్నాయని దబాయింపు చేస్తున్నారు. విచిత్రంగా రాత్రి వేళల్లో అనుమతు లు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నా యి. దీనిపై తహసీల్దార్ జెన్ని రామారావు మాట్లాడుతూ నది నుంచి రాత్రి వేళలో తవ్వకాలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

నదుల అనుసంధానానికి కేటాయింపులేవీ?


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: వంశధార, బాహుదా నదుల అనుసంధానానికి తాజా బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయకపోవడం దారుణమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. గురువారం శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే, నదులను అనుసంధానం చేసే కార్యక్రమాలు చేపడతామని ఎన్నికల ముందు అట్టహాసంగా ప్రకటనలు చేసిన చంద్రబాబు ఇప్పుడు ఆ విషయాన్నే విస్మరించడం సరికాదన్నారు. ముఖ్యంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు, రైతాంగానికి ఎంతో అవసరమైన వంశధార నది జలాలను బాహుదాకు అనుసంధానం చేసేందుకు బడ్జెట్లో ఒక రూపాయి కూడా కేటాయింపులు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. కేవలం వర్షాధారం మీదే వ్యవసాయ రంగం కొనసాగుతోందన్నారు.

10న అప్రెంటీస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 10న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ మేళాకు హాజరవుతారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఆధార్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

భక్తుడిపై దాసుడి దురుసు ప్రవర్తన


తనపై దాడి జరిగిందని చెబుతున్న ధర్మారావు

సంతబొమ్మాళి: తక్కువ డబ్బులు పల్లెంలో పెట్టాడని ఆగ్రహిస్తూ సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడుపేట పంచాయతీ పోతునాయుడుపేట గ్రామానికి చెందిన రెయ్యమ్మ దాసుడు (పరపటి రాము) తనపై దాడి చేశాడని టెక్కలి మండలం బొరిగిపేట గ్రామానికి చెందిన రోణంకి ధర్మారావు ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం దాసుడి వద్దకు వెళ్లి పళ్లెంలో పండ్లు, రూ.50 పెట్టగా.. ఇంత తక్కువ ఇస్తావా అంటూ ఆగ్రహిస్తూ పండ్లు, డబ్బులను బయటకు విసిరేశాడని, ఇదేంటని ప్రశ్నిస్తే దాడిచేసి సెల్‌ఫోన్ లాక్కున్నాడని వాపోయాడు. సెల్‌ఫోన్ తిరిగిచ్చేయాలని కోరితే అనుచరులు బయటకు గెంటేశారని, కొంతసేపటి తర్వాతే తిరిగిచ్చారని చెప్పాడు. కాగా, ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆరా తీశారు.

బార్ కౌన్సిల్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయవాదుల బార్ కౌన్సిల్ ఎన్నికలకు నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. ఏడాదికి ఒకసారి జరిగే ఈ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు కె.ఈశ్వరరావు, వై.ప్రసన్నకుమార్ ప్రకటించారు. ఈ నెల 10న ఎన్నికల అధికారిని నియామకం, 17న నామినేషన్ల స్వీకరణ, 19న నామినేషన్లు పరిశీలన, 20న నామినేషన్ల ఉపసంహరణ, 21న పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తారు. 27న ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. కార్యవర్గంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి, మహిళా ప్రతినిధులు తదితర సభ్యులను ఎన్నుకుంటారు.

మహిళాభ్యున్నతికి తోడ్పాటు


మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం రమేష్‌కృష్ణ

శ్రీకాకుళం అర్బన్ : మహిళాభ్యున్నతికి నాబార్డు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక శక్తిగా ఎదగాలని నాబార్డు డీడీఎం కె.రమేష్ అన్నారు. శ్రీకాకుళం పట్టణంలో నాబార్డు, ఐసీడీఎస్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, స్వయం ఉపాధి అభివృద్ధి అంశాలపై మహిళలు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డీఆర్‌డీఏ డీపీఎం ఏ.శ్రీగౌరి, సీఐ టి.త్రినేత్రి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ అనూష, డాక్టర్ వి.సునీత, సీడీపీవో శోభారాణి, డీసీసీబీ మేనేజర్ సంధ్యారాణి, ఝాన్సీ, లలిత, ఎఫ్‌పీఓలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అప్పుడు వదిలేసి.. ఇప్పుడు బాదుడా?

- కృష్ణాపురం పీఏసీఎస్ పరిధిలో రైతుల ఖాతాల్లో అప్పు మొత్తాల పెంపు
- కరోనా సమయం నాటి వడ్డీ అంటూ పొంతనలేని సమాధానాలు
- ఆందోళనలో రైతులు


కృష్ణాపురం పీఏసీఎస్ కార్యాలయం

ఆమదాలవలస: పట్టణంలోని కృష్ణాపురం వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) కార్యాలయంలో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు వడ్డీ బాదుడుపై లబోదిబోమంటున్నారు. గతంలో వాడిన అప్పు మొత్తాలకంటే ఎక్కువ చూపిస్తూ ఇప్పుడు వడ్డీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఒక్కో రైతుకు రూ.లక్షకు రూ. 3వేలు నుంచి రూ.4 వేలు వరకు అధికంగా కలిపిజాబితా చూపిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. ఇదేంటని సిబ్బందిని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని వాపోతున్నారు.

భారీగా తేడాలు..

కృష్ణాపురం పీఏసీఎస్ పరిధిలో ఆమదాలవలస మండలం, మున్సిపాలిటీకి సంబంధించి 2796 మంది రైతులు రుణాలు వాడారు. ఆయా రైతుల పేరిట రూ.15,77,7,642 అప్పు ఉన్నట్లు చూపిస్తున్నారు. ఇంతవరకు రెన్యువల్స్ చేసి వడ్డీలు చెల్లించిన సుమారు 400 మంది రైతుల నుంచి రూ.1.50 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. 2019-20 సంవత్సరంలో కరోన సమయంలో రైతులు వడ్డీలు చెల్లించలేదని, దీంతో ఆ మొత్తాలు ఇప్పుడు ఖాతాలకు జమచేసినట్లు చెబుతున్నారు. నాలుగేళ్ల పాటు వదిలేసి ఈ ఏడాది మాత్రమే అదనంగా కలపడంపై రైతులు మండిపడుతున్నారు. మరోవైపు గతంలో రాష్ట్ర ప్రభుత్వం 4శాతం వడ్డీ రాయితీ, కేంద్ర ప్రభుత్వం 3 శాతం వడ్డీరాయితీ ఇవ్వకపోవడంతో ఆ మొత్తం కోపరేటివ్ బ్యాంకు ద్వారా రైతుల ఖాతాలకు జమచేసినట్లు సిబ్బంది చెబుతున్నారు. అదే విధంగా, కృష్ణాపురం పీఏసీఎస్ అప్పు మొత్తాలకు, కో ఆపరేటివ్ బ్యాంకుకు పీఏసీఎస్ చెల్లించాల్సిన మొత్తాకు సుమారు రూ.3 కోట్లు తేడా చూపిస్తున్నట్లు సమాచారం. ఈ మొత్తాలను కూడా ఎక్కడ తమకే విధిస్తారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పీఏసీఎస్ పరిధిలో వడ్డీలు, రుణాలు చెల్లిస్తున్న రైతులకు ఎటువంటి రసీసులు ఇవ్వకుండా ఖాళీ ఓచర్లపై సంతకాలు పెట్టిస్తూ పంపిస్తున్నారని, ఇలాంటి చర్యలు మోసగించడానికేనని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.


కృష్ణాపురం పీఏసీఎస్‌లో రైతుల రుణాలను రెన్యువల్స్ చేయిస్తున్న సీఈఓ వెంకట్రావు

బ్యాంకు జాబితా మేరకే..



బ్యాంకుల నుంచి మాకు వచ్చిన జాబితా ప్రకారం రైతుల నుంచి వడ్డీలు వసూలు చేస్తున్నాం. అప్పు మొత్తాలకు ప్రతి రైతు ఖాతాకు 4 శాతం మొత్తం చేసి లక్ష రూపాయలకు రూ.4000 చొప్పున కలిపి జాబితాలో వచ్చింది. 2020లో కరోనా సమయంలో ఇక్కడ సిబ్బంది వడ్డీలు వసూలు చేయలేదు. ఆ మొత్తాలను 2024లో రైతుల ఖాతాలకు కలిపినట్లు ఉన్నతాధికారులు రైతులకు చెప్పమన్నారు.

-చిగురుపల్లి వెంకటరావు, కృష్ణాపురం పీఏసీఎస్ సీఈఓ.

రూ.3వేలు అదనం..



గత ఏడాది రూ.1.02 లక్షలు అప్పు చూపిస్తే ఆ మొత్తానికి వడ్డీ జమ చేసి రెన్యూవల్ చేయించుకున్నాను. ఈ ఏడాది అప్పు ఖాతా రూ. 1.05 లక్షలకు పెంచిచూపించారు. ఆ మొత్తానికి వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సిబ్బంది చెబుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే కరోనా సమయంలో 2020లో బ్యాంకు సిబ్బంది వడ్డీ వసూలు చేసేందుకు రాలేదని, ఇప్పుడు ఆ మొత్తం కలిపేశామని చెబుతున్నారు.

– తమ్మినేని శ్రీనివాసరావు, రైతు, కట్యాచార్యులపేట

రసీదులు ఇవ్వడం లేదు..



అప్పు, వడ్డీ చెల్లింపులు చేస్తున్నప్పుడు రైతులకు ఎటువంటి రసీదులు ఇవ్వడంలేదు. ఖాళీ ఓచర్లపై సంతకాలు చేయించుకుంటున్నారు. అసలుకు ఎసరు పెడుతూ అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. లక్షల్లో అప్పులు వాడిన ప్రతి రైతుకు 4 శాతం మొత్తం రుణ ఖాతాకు కలిపారు. ఉన్నతాధికారులు పరిశీలించి రైతులకు న్యాయం చేయాలి.

– పేడాడ భానూజీరావు, కొర్లకోట, ఆమదాలవలస మండలం

లిఫ్ట్ ఇచ్చి.. పుస్తెలతాడు కొట్టేసి..

- మానంపేట వద్ద చైన్‌స్నాచింగ్
- వృద్ధురాలికి స్వల్ప గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ అవతారం

జి.సిగడాం: మండలంలోని మర్రివలస గ్రామంలో వృద్ధురాలి మెడలో పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి తెంచుకుపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మర్రివలసకు చెందిన పలిశెట్టి కన్నమ్మ మానంపేట గ్రామానికి నడిచి వెళ్తుండగా అటువైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి లిఫ్ట్ అడిగింది. మానంపేట వద్ద దిగి నడుచుకుంటూ వెళ్తుండగా వెనకి నుంచి వచ్చి ముఖంపై కారంజల్లి మెడలో తులన్నర బంగారు పుస్తెల తాడును తెంచుకుని బైక్‌తో పరారయ్యాడు. ఈ ఘటనలో వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎం.అవతారం, ఎస్‌ఐ మధుసూదనరావు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన మద్యం షాపుల లాటరీ

- జేసీ సమక్షంలో గీత, సొండి కులాలకు 18 దుకాణాల కేటాయింపు
- హడావిడి చేసిన టీడీపీ నాయకులు


డ్రా టోకెన్లు తీస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, చిత్రంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : కొత్త మద్యం పాలసీ (2024-26)లో భాగంగా గీత, సొండి కులాలకు ప్రభుత్వం కేటాయించిన 18 మద్యం షాపులకు గురువారం లాటరీ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. గతేడాది అక్టోబరులో జనరల్ క్యాటగిరీలో జిల్లాలో 158 మద్యం షాపులకు డ్రా తీసిన సంగతి తెలిసిందే. అప్పట్లో 4671 దరఖాస్తులు రాగా ఇప్పుడు 203 దరఖాస్తులొచ్చాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగం డిప్యూటీ కమిషనర్ దోసకాయల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ డ్రా టోకెన్లను అభ్యర్థుల సమక్షంలో తీసి చూపించారు.

ఎంపికైన రోజే కట్టేశారు..

గీత కుల ఉప కులాలైన సెగిడి (4), శ్రీశయన (10), యాత(1), గౌడ (1) కులాల వారికి కేటాయించిన 16 దుకాణాలకు, సొండి కులాలవారి రెండు దుకాణాలకు అభ్యర్థులను ఎంపిక చేయగా వెంటనే రిజిస్టర్‌లో సంతకాన్ని పెట్టి మొదటి వాయిదా సొమ్ము సుమారు రూ. 9 లక్షలు (ఒక్కొక్కరికి) కట్టేసి కుల, ఉపకుల ధృవీకరణపత్రాలను ఇచ్చేశారు. జనరల్ క్యాటగిరిలో రూ.65 లక్షలు సంవత్సర ఫీజు ఛలానాల రూపంలో కట్టగా.. వీరు రూ. 35 లక్షలను నాలుగు వాయిదాల్లో ప్రభుత్వానికి కట్టాల్సి ఉంది.

ద్వితీయ శ్రేణి నాయకుల హడావిడి..

పేరుకు గీత, సొండి కులాల వారికే షాపులు కేటాయించడం జరిగినా అక్కడ టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుల హడావిడే కనిపించింది. సిండికేట్‌గా ఏర్పాటయ్యేందుకు వారి కనుసన్నల్లో ముందుగానే మంత్రాంగం నడిచినట్లు సమాచారం. ప్రభుత్వం జనరల్ క్యాటగిరీలో మొదటిచ్చిన తొమ్మిదికి పైగా మార్జిన్‌తో రూ.లక్షల్లో నష్టాలను చవిచూసిన సిండికేట్ ఇటీవల 14కి పైగా మార్జిన్ పెంచడంతో వీరి కోటాలోనైనా (సగం ధరకే షాపులు దక్కడం) గుత్తాధిపత్యం చేసి సొమ్ములు చేసుకునే యోచనలో ఉన్నట్లు అక్కడక్కడా వినిపించింది.

ఆ తప్పులు దొర్లకుండా..

గతంలో 6వ నెంబరు టోకెన్‌ను ముందుగా సక్సెస్ అప్లికెంట్‌గా ప్రకటించిన కాసేపటికే 9వ నెంబరు టోకెన్ అభ్యర్థిని మళ్లీ ప్రకటించడంతో తీవ్ర వాగ్వాదానికి దారి తీసిన సంగతి తెలిసిందే. ఈసారి ఆ తప్పు దొర్లకుండా 6వ నెంబర్ టోకెన్‌కు కింది భాగాన బాణం గుర్తు పెట్టి డ్రా తీసే ముందు ప్రతీసారి దరఖాస్తుదారులకు చూపించారు. శ్రీకాకుళం ఎక్సైజ్ స్టేషన్ పరిధి రెండు షాపులకు (మున్సిపల్ కార్పొరేషన్-31, రూరల్- 24) అత్యధికంగా 55 దరఖాస్తులు అందగా ఇచ్ఛాపురం రూరల్ పరిధి ఓ షాపునకు అత్యల్పంగా ఇద్దరే దరఖాస్తు వేయడం గమనార్హం. అనంతరం జేసీ మాట్లాడుతూ డ్రా ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెప్పారు. లైసెన్సుదారులకు ప్రొవిజనల్ లైసెన్సు ఇచ్చి అనంతరం రెగ్యులర్ లైసెన్సును ఎక్సైజ్ విభాగం ద్వారా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తిరుపతినాయుడు, సీఐ గోపాలకృష్ణ, ఎక్సైజ్ స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేటలో దొంగలు హల్‌చల్


నాగేశ్వరరావు ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. పట్టణ శివారులో జాతీయ రహదారి సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న శ్రీనివాసనగర్‌లో రెండు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. తొలుత వీధిలో ఉన్న సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి పట్నాల నాగేశ్వరరావు ఇంట్లో చొరబడ్డారు. నాగేశ్వరరావు కుటుంబం దైవ దర్శనాల టూర్‌లో ఉండటంతో ఇదే అదునుగా బీరువాను తెరిచి చిందరవందర చేశారు. ఇంటి ముందు సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. ఇంట్లో ఏయే వస్తువులు చోరీకి గురయ్యాయో నాగేశ్వరరావు కుటుంబం తిరిగి వస్తే తప్ప స్పష్టత రాదు. ఈ ఇంటికి సమీపంలో ఉంటున్న పోలాకి మండలం రేవు అంప్లాం పంచాయతీ కార్యదర్శి టి.దుర్గాప్రసాద్ ఇంట్లో కూడా దుండగులు చోరీకి ప్రయత్నించారు. అక్కడ ఏమీ దొరక్కపోవడంతో గేటు విరగ్గొట్టి వెళ్లిపోయారు. గురువారం విషయం తెలుసుకున్న నరసన్నపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్ చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. కాగా, దేవుడు బొమ్మలతో మూడు చక్రాల రథాలపై కొందరు వచ్చారని, చోరీ వీరి పనే అయి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు.

సీనియారిటీ జాబితాలో తప్పులు సవరించాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ జిల్లా నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచిన ఉపాధ్యాయ సీనియారిటీ జాబితాలో తప్పులు దొర్లాయని.. వాటిని సవరించాలని జిల్లా ఎస్టీయూ నాయకులు ఎస్వీ రమణ, జి.రమణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ తిరుమల చైతన్యకు వినతిపత్రం అందజేశారు. కొంతమందివి డీఎస్సీ సంవత్సరాల్లో తప్పులున్నాయని, కొంతమంది పేర్లే లేవని, మేనేజ్‌మెంట్లలో తప్పులు, దోషాలున్నాయని పేర్కొన్నారు. అప్పీల్ చేసుకునేందుకు గడువు పెంచాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన డీఈఓ తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్టీయూ ప్రతినిధులు కె.శ్రీనివాసరావు, చింతల రామారావు, ఎస్.లక్ష్మణరావు, ఎం.తేజ, జి.శ్రీను, డీవీఎస్, హరి, సీహెచ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

● ఆయుధాలపై అవగాహన



ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయం కమ్యూనిటీ హాలులో గురువారం మహిళా సాధికారిత వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీస్ విధులు, ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానంపై డీఎస్పీ ఎల్.శేషాద్రి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

కేజీ గంజాయికి వెయ్యి కమీషన్

- గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు
- వివరాలు వెల్లడించిన కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు


వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు

కవిటి: ఒడిశా సరిహద్దు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాలను ఎప్పటికప్పుడు పట్టుకుంటున్నామని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు తెలిపారు. కవిటి పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తాజాగా పట్టుబడిన 10.250 కిలోల గంజాయికు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లా లాఠీ గ్రామానికి చెందిన సురేష్ నాయక్ తన స్నేహితుడు, గంజాయి వ్యాపారం చేసే రాజేంద్ర బాడిత్య సహకారంతో అక్రమ రవాణా వ్యాపారానికి అలవాటుపడ్డాడు. గంజాయిని తీసుకొని బెంగళూరులో తాను చెప్పిన మనిషికి అప్పగిస్తే కేజీకి రూ.1000 కమీషన్‌గా ఇచ్చేవాడు. ఈ క్రమంలో సురేష్ గురువారం రాజేంద్ర బాడిత్య నుంచి 10 కేజీల 250 గ్రాముల గంజాయిని తీసుకొని బరంపురం నుంచి బస్సులో బయలుదేరి కొజ్జీరియా టోల్‌గేటు ముందు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద దిగాడు. అక్కడి నుంచి కంచిలి రైల్వే స్టేషనుకు వెళ్లేందుకు బస్సు కోసం నిరీక్షిస్తుండగా ముందస్తు సమాచారంతో కవిటి ఎస్‌ఐ వి.రవివర్మ తన సిబ్బందితో వెళ్లి సురేష్‌నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. సమావేశంలో ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నంనాయుడు, కవిటి ఎస్‌ఐ వి.రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీన్నర గంజాయితో..

ఇచ్ఛాపురం: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీమ్‌పట్నం మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన కొర్లపాటి వంశీ అనే యువకుడు కేజీన్నర గంజాయితో పట్టుబడినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. గురువారం ఇచ్ఛాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిందితుడితో పాటు ఆదే గ్రామానికి స్నేహితులు కలపాటి తేజ, కుంచాల సూర్యలు గంజాయికి బానిసయ్యారు. అవసరమైనప్పుడలా ఒడిశా వచ్చి గంజాయిని కొనేవారు. ఈ క్రమంలో వంశీ గురువారం ఒడిశాలో కేజీ 540 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి బస్సులో ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కి వస్తుండగా పట్టణ పోలీసులకు చిక్కాడు. నిందితుడి వద్ద గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, పట్టణ ఎస్సై ముకుందరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల్లో గంజాయి విక్రయం!

ఆమదాలవలస: పట్టణంలో ఇటీవల పలు దుకాణాల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ ప్రధాన రహదారిపై ఉన్న ఒక దుకాణానికి మఫ్టీలో ఉన్న పోలీసు సిబ్బంది వెళ్లి గంజాయి కావాలని అడగ్గా.. పోలీసులని తెలియక నిర్వాహకురాలు గంజాయి ఇచ్చినట్లు తెలిసింది. దీంతో దుకాణం నిర్వహిస్తున్న దంపతులను పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై ఆమదాలవలస సీఐ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా దుకాణాలు తనిఖీలు చేస్తున్నామని, ఎవరైనా పట్టుపడితే విలేకరుల సమావేశంలో వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

వ్యక్తి అదృశ్యం



కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన కుప్పిలి మల్లేశ్వరరావు (61) కనిపించడం లేదని కుమార్తె మామిడి గీతారాణి గురువారం కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిబ్రవరి 19న బయటకు వెళ్లి ఇంతవరకు రాలేదని, అన్నిచోట్లా వెతికినా ఆచూకీ తెలియలేదని పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే 949475297 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక అంశాలపై పట్టు అవసరం


టెక్నివేర్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో సాంకేతిక అంశాలపై పట్టు అవసరమని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ అన్నారు. ఎస్ఎంపురం క్యాంపస్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న టెక్నికల్ ఫెస్ట్ టెక్నివేర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం, సాంకేతిక అంశాల అవగాహన ఆధారంగా కార్యక్రమం జరుగుతుందని, 600 కళాశాలలను ఆహ్వానించామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ కొక్కిరాల వెంకటగోపాల ధన బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, సెమినార్ కన్వీనర్ గేదెల రవి, సహాయ కన్వీనర్ తేజ్‌కిరణ్ పాల్గొన్నారు.

వీఆర్‌ఓలపై ఇతర శాఖల పెత్తనం తగదు


డచ్ భవనం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌వోలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ రెవెన్యూ అధికారులపై ఇతర శాఖల అధికారుల పెత్తనం చలాయిస్తున్నారని, వారు చేయాల్సిన పనులు తమపై నెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే ఇటువంటి చర్యలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ వీఆర్‌ఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమీపంలోని డచ్‌భవన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి కె.వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు వీఎల్‌ఆర్ శాస్త్రి, గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు మాట్లాడుతూ పంచాయతీరాజ్, సర్వే ఉద్యోగుల విధులు కూడా తమతో చేయించడం దారుణమన్నారు. ఇప్పటికే పీజీఆర్ఎస్, రెవెన్యూ, భూ వివాదాలు, ఇతర అంశాలతో పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, 24 గంటలు పనులు చేస్తున్నా పని భారం తగ్గడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ వార్డు సచివాలయాలు వచ్చాక తమకంటే తక్కువ స్థాయి కలిగిన వారు కూడా గ్రేడ్- 1 వీఆర్‌ఓలపై పెత్తనం చలాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ విజన్ పేరుతో వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్ ఫార్వర్డ్ చేస్తున్నారని చెప్పారు. నిరసన కార్యక్రమంలో వీఆర్‌వోల సంఘం ప్రతినిధులు అప్పలనాయుడు, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు, తౌడు, తదితరులు పాల్గొన్నారు.

తగ్గేదేలే..!


విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే మహిళా ఉద్యోగులు గురువారం మధ్యాహ్నం ఉల్లాసంగా కనిపించారు. మహిళా దినోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్‌జీఓ హోమ్‌లో టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్ వంటి పోటీలు నిర్వహించడంతో ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం పొందారు. – శ్రీకాకుళం అర్బన్